క్లుప్తంగా

పాలిటెక్నిక్ కౌన్సిలింగ్ ప్రారంభం



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోసోమవారం పాలిటెక్నిక్ కౌన్సిలింగ్ ప్రారంభమైంది. 4001 ర్యాంకు నుంచి 8 వేల ర్యాంకు వరకు కౌన్సిలింగ్ నిర్వహించారు. 70 మంది విద్యార్థులు కౌన్సిలింగ్‌కు హాజరై, తమ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకున్నారు. కౌన్సిలింగ్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి పర్యవేక్షించారు.

దత్తసాయి శివకామేశ్వరీ పీఠం వార్షిక వేడుకలు ప్రారంభం



మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివ కామేశ్వరీ పీఠం వార్షిక వేడుకలు సోమవారం శ్రీధర్మపరిషత్ మహా సంస్థానమ్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం తెల్లవారుజామున గోపూజ, విఘ్నేశ్వర పూజతో వేడుకలను ప్రారంభించారు. స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లోక కల్యాణార్థం లక్ష్మీగణపతి హోమం, విజయ గణపతికి పంచామృత రుద్రాభిషేకం అర్చనలు జరిగాయి. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపకుడు అవ్వా హేమ సుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 31వ డివిజన్‌కు చెందిన గొల్లపూడి నాగరాజు ప్రమాదవశాత్తు ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సాయంగా సోమవారం రూ.10 వేలు అందజేశారు. మిగతా బీమా నగదును త్వరలో అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి పెనుమత్స సత్యం, వార్డు వెల్ఫేర్ సెక్రటరీ ఉమా, అడ్మిన్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ప్లాంట్ల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన



భవానీపురం(విజయవాడపశ్చిమ): కేంద్ర ప్రభుత్వం, ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ) అనుసంధానంతో నిర్వహిస్తున్న ది అర్బన్ లెర్నింగ్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్(టులిప్)లో భాగంగా నగరపాలక సంస్థ 11 మంది విద్యార్థులను ఎంపిక చేసింది. ఈ క్రమంలో కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం విద్యార్థులను నగరంలో జరుగుతున్న ఘన, జల వ్యర్థాల నిర్వహణ ప్రక్రియ మీద అవగాహన కోసం వర్మి కంపోస్ట్ ప్లాంట్, బయో మిథనేషన్ ప్లాంట్, పూల వ్యర్థాల నిర్వహణ ప్లాంట్, ఎస్టీపీ ప్లాంట్, ఇంటిగ్రేటెడ్ సాలిడ్ మేనేజ్‌మెంట్ ప్లాంట్లకు తీసుకువెళ్లారు. ఆయా ప్లాంట్ల నిర్వహణ గురించి అధికారులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ ఓబేశ్వరరావు, స్వచ్ఛ సర్వేక్షణ్ టీమ్ ఆశ, రవితేజ, రత్నాకర్, రజనీష్‌లు పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు.

వైఎస్ జగన్ నాలుగేళ్ల పాలనపై నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి నాలుగు సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా మంగళవారం ఉదయం 10 గంటలకు తమ అకాడమీ కార్యాలయంలో ప్రభుత్వ నాలుగేళ్ల పరిపాలన–తీరు తెన్నులు అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ సీ.రాఘవాచారి మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు. సీఎం వైఎస్.జగన్ ప్రారంభించిన పరిపాలన సంస్కరణలు, సంక్షేమ కార్యక్రమాల ఫలాలు పేదలకు అందడం మొదలై నాలుగేళ్లు పూర్తి అవుతుందని, ఈ పరిస్థితులపై మేధావులు జర్నలిస్టులతో ఈ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు, రిటైర్డ్ ప్రొఫెసర్ ఎంసీ.దాస్, మీడియా అకాడమీ కార్యదర్శి బాలగంగాధర్ తిలక్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొంటారని తెలిపారు.

చారిత్రాత్మక పాలనకు సీఎం వైఎస్ జగన్ శ్రీకారం

- ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- రాష్ట్ర ప్రజల నమ్మకాన్ని రెట్టింపు చేసిన సీఎం వైఎస్ జగన్
- బీఆర్టీఎస్ రోడ్డు నుంచి కండ్రిక వరకు భారీ బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే విష్ణు, నాయకులు



ర్యాలీలో కదం తొక్కిన పార్టీ శ్రేణులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని ఎప్పటికప్పుడు రెట్టింపు చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చారిత్రాత్మక పాలనకు శ్రీకారం చుట్టారని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు బీఆర్టీఎస్ రోడ్డులోని గాయత్రి కన్వెన్షన్ హాల్ నుంచి కండ్రిక వరకు సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ.. నిరుపేద ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చడమే నిజమైన సంక్షేమం, అభివృద్ధి అని శాసనసభ వేదికగా చెప్పడమే కాకుండా వాటిని నిజం చేసి చూపిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని కొనియాడారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి, అన్ని రంగాలలో సర్వతోముఖాభివృద్ధికి విశేషంగా కృషిచేస్తున్నారని వెల్లడించారు. ఎన్నికల ముందు ఇచ్చిన మ్యానిఫెస్టోలో 98 శాతం హామీలను పూర్తిచేసి రైతులు, కార్మికులు, మహిళలు, యువత ఇలా అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వారి అభ్యున్నతికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు.

దుష్ప్రచారాలు ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరు..

నీతి ఆయోగ్ సైతం మన జగనన్న అందిస్తున్న పాలనను కొనియాడిందంటే, మన పథకాలను ఇతర రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. దీన్ని బట్టి ముఖ్యమంత్రిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంత ఘనవిజయం సాధించారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే విష్ణు చెప్పారు. మహానాడులో టీడీపీ ప్రవేశపెట్టిన తీర్మానాలు, చంద్రబాబు చెప్పిన బూటకపు మేనిఫెస్టోను చూసి ఆ పార్టీ కార్యకర్తలే నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, ఎల్లో మీడియా కలిసి ఎన్ని దుష్ప్రచారాలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని, 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మరో సరికొత్త ప్రభంజనాన్ని సృష్టించడం తథ్యమన్నారు. గాయత్రి కన్వెన్షన్ నుంచి ప్రారంభమైన ఈ బైకు ర్యాలీ బీఆర్టీఎస్ రోడ్డు మీదుగా ఫుడ్‌జంక్షన్‌కు చేరుకొని అక్కడి నుంచి గవర్నమెంట్ ప్రెస్, బుడమేరు, సింగ్‌నగర్, పాయకాపురం వైపుగా కండ్రిక సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వరకూ జరిగింది. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఎమ్మెల్యే విష్ణు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్పొరేటర్లు శర్వాణిమూర్తి, బాలిగోవింద్, కొంగితల లక్ష్మీపతి, యరగొర్ల తిరుపతమ్మ, కుక్కల అనిత, నాయకులు బెజ్జం రవికుమార్, అలంపూరు విజయ్, ఆత్మకూరు సురేష్, ఒగ్గు విక్కి, వెన్నం రత్నారావు, ఎండీ హఫీజుల్లా, ఉమ్మడి వెంకట్రావ్, నందెపు సురేష్, గుండె సుందర్‌పాల్, ఇసరపు రాజు, ఉద్దంటి సురేష్, బెవర నారాయణ, ఎస్కే ఇస్మాయేల్, మేడేపల్లి ఝాన్సీ, తోపుల వరలక్ష్మి, అన్ని డివిజన్లలోని నాయకులు పాల్గొన్నారు.

రేపు కన్యకాపరమేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురం జీఎస్ రాజు రోడ్డు, వాటర్ ట్యాంక్ పక్కన నూతనంగా నిర్మించిన కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 31న శ్రీ వాసవి మాత, విఘ్నేశ్వరుని విగ్రహ ప్రతిష్ఠ, కలశ స్థాపన మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మైలవరపు రామకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ బొడ్డు శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల కరపత్రాలు ఆవిష్కరించి వివరాలు వెల్లడించారు. గురు వందనం, గోపూజ, గణపతి పూజతో పాటు మహా నీరాజనం తదితర పూజాది కార్యక్రమాలు మంగళవారం నిర్వహిస్తామని తెలిపారు. 31వ తేదీ బుధవారం ఉదయం 8.01 గంటలకు యంత్ర ప్రతిష్ఠ స్థాపన, మూల మంత్రహోమాలతో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, అష్టోత్తర శత కలశ అభిషేకాలు, అమ్మవారికి విశేష పూజలు జరుగుతాయన్నారు. ఉత్సవాలకు సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, స్థానిక కార్పొరేటర్ శర్వాణిమూర్తి హాజరవుతారని తెలిపారు. నగరంలోని ఆర్యవైశ్యులు, అమ్మవారి భక్తులు పాల్గొనాలని కోరారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం 5 వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరుగుతుందన్నారు. సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మండవ కుటుంబరావు మృతి



మండవ కుటుంబరావు(ఫైల్)

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రముఖ సేవాతత్పరుడు, ఏపీ ప్రైవేట్ ఎలక్ట్రికల్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు మండవ కుటుంబరావు(67) గుండెపోటుతో మృతి చెందారు. సోమవారం సాయంత్రం గుండెనొప్పి రావటంతో ఆస్పత్రికి తరలించగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. చుట్టుగుంటకు చెందిన మండవ కుటుంబరావు తిరుమల తిరుపతి దేవస్థానానికి ప్రతి నెలా పది టన్నుల కూరగాయలారీని పంపించటంతో పాటు నగరంలోని అనేక మంది దాతలను ప్రోత్సహించి కూరగాయలను పంపేవారు. నగరంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు. కుటుంబరావు భార్య కాశీ అన్నపూర్ణ గతంలోనే మృతి చెందారు. ఆయన కుమార్తె విదేశాల్లో ఉన్నారు. ఆమె వచ్చిన తర్వాత అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. నగరానికి చెందిన పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు చర్యలు



పాలక మండలి తీర్మానాలను వివరిస్తున్న చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ, సభ్యులు

- గిరి ప్రదక్షిణ మార్గంలో దేవస్థాన బస్సు సౌకర్యం
- సేవకులకు లడ్డూ, రెండు పులిహోర ప్యాకెట్లు
- పాలక మండలి సమావేశంలో పలు తీర్మానాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు దుర్గ గుడి చైర్మన్ కర్నాటి రాంబాబు పేర్కొన్నారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన పాలక మండలి సమావేశం సోమవారం బ్రాహ్మణ వీధికి జమ్మిదొడ్డి ఆవరణలోని బోర్డు మీటింగ్ హాల్‌లో జరిగింది. చైర్మన్ కర్నాటి రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పాలక మండలి సభ్యులు, ఈవో భ్రమరాంబ, ఈఈలు కోటేశ్వరరావు, ఎల్.రమా, ఏఈవోలు ఎన్.రమేష్‌బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో 8 అంశాలపై చర్చ సాగింది.

కోల్డ్ స్టోరేజీ ఏర్పాటుకు కృషి

దుర్గాఘాట్ వద్ద పవిత్రమైన కృష్ణానదిలోకి భక్తులు దిగి పుణ్యస్నానాలు ఆచరించేలా స్నానఘాట్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇప్పటికే ఘాట్‌లో భక్తులు దుస్తులు మార్చుకునేందుకు గదుల నిర్మాణం జరుగుతుండగా, భక్తులు స్నానమాచరించే నది పరివాహక ప్రాంతంలో పేరుకుపోయిన బురదను తొలగించేందుకు టెండర్లు ఆహ్వానించినట్లు చైర్మన్ పేర్కొన్నారు. అమ్మవారి ప్రసాదాలు, అన్నదానానికి వినియోగించే సరుకులను నిల్వ చేసేందుకు కోల్డ్ స్టోరేజీని ఏర్పాటు చేస్తామన్నారు. ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ మార్గంలో దేవస్థానం బస్సును నడపాలని పాలక మండలి నిర్ణయించింది. దుర్గాఘాట్ నుంచి ప్రారంభమయ్యే బస్సు, కుమ్మరి పాలెం, సితార, పాలప్రాజెక్టు, కొత్తపేట మీదగా మాడపాటి సత్రం, రైల్వే స్టేషన్ 10వ నంబర్ ప్లాట్‌ఫాం, కాశేశ్వరరావు మార్కెట్ మీదుగా కనకదుర్గనగర్‌కు చేరుకుంటుందన్నారు. ఈ బస్సు ఏర్పాటు చేయడం వల్ల వన్‌టౌన్, గట్టు వెనుక ప్రాంతవాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. అమ్మవారి సన్నిధిలో సేవ చేసేందుకు వచ్చే భక్తులకు ఉచితంగా లడ్డూ, రెండు పులిహోర ప్రసాదాలను అందించేందుకు పాలక మండలి ఆమోదం తెలిపింది. అమ్మవారి దర్శనానికి విచ్చేసే వృద్ధులు, దివ్యాంగుల కోసం మహా మండపం దిగువన నాలుగు, కొండపై సమాచారం కేంద్రం వద్ద మరో నాలుగు, మహా మండపం 7వ అంతస్తులో మరో రెండు వీల్‌చైర్స్‌ను అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు.

మహా మండపంలో ఆర్జిత సేవా టికెట్ల కౌంటర్

మహా మండపం దిగువన టోల్‌ఫ్రీ నంబర్ కార్యాలయంలో ఆర్జిత సేవా టికెట్ల విక్రయ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోనే ఆర్జిత సేవా టికెట్ల కౌంటర్ భక్తులకు అందుబాటులో ఉంది. ముందుగా ఆర్జిత సేవా టికెట్ పొందాలనే వారు ఆలయ ప్రాంగణానికి వచ్చి టికెటు తీసుకోవాల్సి ఉంది. ఇకపై ఆ ఇబ్బంది తొలగిపోయ్యేలా పాలక మండలి మరో కౌంటర్ ఏర్పాటుకు చేయాలని ఆలయ అధికారులను కోరింది. కరోనా సమయంలో తగ్గించిన అన్న ప్రసాద వితరణను ఇకపై ప్రతి రోజు నాలుగు వేల మందికి, శుక్ర, ఆదివారాలు ఐదు వేల మందికి ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పాలక మండలి సమావేశంలో సభ్యులు బుద్దా రాంబాబు, దేవిశెట్టి బాలకృష్ణ, చింతా సింహాచలం, నంబూరి రవి, చింకా శ్రీనివాసరావు, బచ్చు మాధవీకృష్ణ, తొట్టడి వేద కుమారి, కొలుకులూరి రామసీత, అనుమోలు ఉదయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

వైద్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలి



లబ్బీపేట(విజయవాడతూర్పు): వైద్య ఆరోగ్య శాఖలో అమలులో ఉన్న కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించేలా ప్రోగ్రామ్ అధికారులు పర్యవేక్షించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ మాచర్ల సుహాసిని ఆదేశించారు. నగరంలోని తన కార్యాలయంలో వివిధ కార్యక్రమాల ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్లతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పునరుత్పత్తి శిశు ఆరోగ్యం, గర్భస్రావాలు, గర్భిణీలు, బాలింతల సేవలు, ఎన్‌సీడీ–సీడీ, కుటుంబ వైద్యుని కార్యక్రమం అమలు తదితర అంశాలపై సమీక్షించారు. ప్రతి కార్యక్రమాన్ని వంద శాతం విజయవంతంగా నిర్వహించాలన్నారు. జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని, నిరంతరం ఆయా ప్రోగ్రామ్స్‌ను మానిటరింగ్ చేయాలని సూచించారు. అంతేకాకుండా ప్రభుత్వం నిర్దేశించిన యాప్‌లలో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ నళినీదేవి, సీనియర్ పబ్లిక్‌హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నరసింహనాయక్, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు, ఎన్‌సీడీ–సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ మాధవి, స్టాటిస్టికల్ ఆఫీసర్ లక్ష్మీజీ, డీపీహెచ్ఎన్ఓ లిడియా పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



జానపద నృత్యాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు

విజయవాడకల్చరల్: విజయశ్రీ సాంస్కృతిక సేవా సంస్థ, తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి చారిటబుల్ సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో సోమవారం సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ రంగాలకు చెందిన వారికి జాతీయ కళారత్న పురస్కారాల కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు నేత్రపర్వంగా సాగాయి. మధురిమ బృందం చేసిన జానపద నృత్యాలు డాక్టర్ సరికొండ రమాదేవి ఝాన్సీ లక్ష్మీబాయి, ఏకపాత్రాభినయం ఆకట్టుకున్నాయి. ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా వివిధ రంగాలకు చెందిన వ్యక్తులకు 108 మందికి ఎన్టీఆర్ స్మారక పురస్కారాలను ప్రదానం చేశారు. విజయశ్రీ సాంస్కృతిక వేదిక వ్యవస్థాపకుడు బండారు నరసింహారావు, గాయని వడ్డాది సూర్యకామేశ్వరి నిర్వహించారు. సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు ప్రసూనా రామన్, తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస భరద్వాజ పాల్గొన్నారు.

అలరించిన సినీ, భక్తి సంగీత విభావరి



భక్తి గీతాలను ఆలపిస్తున్న గాయకులు స్వాతి, రాజు, నవీన

విజయవాడకల్చరల్: ప్రణవీ మ్యూజిక్ అకాడమీ, పద్మశ్రీ ఎన్టీఆర్ సామాజిక సేవా సంఘం ఆధ్వర్యంలో సినీనటుడు ఎన్టీఆర్ శతజయంతి వేడుకల సందర్భంగా గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై సోమవారం నిర్వహించిన సినీ భక్తి, లలిత సంగీత విభావరి ఆకట్టుకుంది. ప్రణవీ మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకుడు కారుమంచి రాజు ఆధ్వర్యంలో నవీన, కొమ్మినేని రత్నకుమారి, మల్లాది స్వాతి, రసూల్‌బాబు, చంద్రశేఖర్, అయ్యప్పన్ ఎన్టీఆర్ నటించిన పలు చిత్రాల్లోని పాటలు, భక్తి గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా గాయని మల్లాది స్వాతిని నిర్వాహకులు సత్కరించారు. కారుమంచి రాజు మాట్లాడుతూ.. దేశంలోని అనేక ప్రాంతాల్లో సినీ సంగీత విభావరి కార్యక్రమాల్లో పాల్గొంటున్న గాయని స్వాతి సేవలను కొనియాడారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, జిలానీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సహకార రంగంలో పత్రిక సాహసోపేతం

- సీఆర్ ఏపీ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని
- సహకారభూమి లోగో ఆవిష్కరణ



లోగోను ఆవిష్కరించిన కొమ్మినేని శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సహకార రంగం ఒకప్పుడు రాజకీయాలను శాసించే దశలో ఉండేదని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోయినా నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా సహకార వ్యవస్థకు సహకార భూమి పక్షపత్రిక నూతన జవసత్వాలు అందించాలని సి.రాఘవాచారి మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు సూచించారు. సహకార రంగంలోని సానుకూల అంశాలతో పాటు లోటుపాట్లను కూడా సహకారభూమి పత్రిక అందించాలని చెప్పారు. విజయవాడ శ్యామ్‌నగర్ ఎన్జీవో కాలనీలోని సహకార భూమి కార్యాలయంలో సోమవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఆయన సహకారభూమి లోగోను ఆవిష్కరించారు. ఈసందర్భంగా జరిగిన సభకు సహకారభూమి వ్యవస్థాపక అధ్యక్షులు, కేడీసీసీ బ్యాంక్ చైర్ పర్సన్ తన్నీరు నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఆప్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ డి. శ్రీనాథ్ రెడ్డి సహకారభూమి కార్యాలయం ముందు సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పరస్పర సహకారంతోనే ఏ రంగమైనా అభివృద్ధి చెందుతుందన్నారు. తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ సహకార రంగానికి జవసత్వాలు కల్పించేందుకు ఈ పత్రిక ఉపయోగపడాలని కోరారు. సిబ్బందికి సమగ్ర సమాచారం అందించడం, జీవోలు, ఇతర సమాచారం అందించేందుకు పత్రికను తీసుకువస్తున్నట్లు తెలిపారు. సహకార ధర్మపీఠం సంపాదకులు, సహకార రంగ నిపుణుడు భూమయ్య సహకార రంగ పితామహుడు రామదాసు పంతులు చిత్రపటాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సహకారభూమి వ్యవస్థాపకుడు దాసరి కేశవులు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు, పీపుల్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ చైర్మన్ ఎల్లారావు, సహకారభూమి పత్రిక సంపాదకులు అక్బర్ పాషా, సహకార రంగ ప్రముఖులు సాంబిరెడ్డి, వ్యవస్థాపక సభ్యులు కేవి కృష్ణ, కేఎస్ జ్యోతి శ్రీ, సీహెచ్ త్రినాథ్ పాల్గొన్నారు.

స్పందన అర్జీదారుల సంతృప్తే లక్ష్యం

నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి



ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి

భవానీపురం(విజయవాడపశ్చిమ): అర్జీదారుల సంతృప్తే లక్ష్యంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి నగర ప్రజల నుంచి స్పందనలో వచ్చిన అర్జీలను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆదేశించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆమె నగరవాసుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. అర్జీదారుల సమస్యలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. నగర ప్రజలకు ప్రభుత్వం, నగరపాలక సంస్థ కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, పథకాలను సకాలంలో అందుతున్నాయా లేదా అనేది నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అదే సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించాలన్నారు. స్పందనలో వచ్చే సమస్యలపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దన్నారు. సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. గత వారం స్పందనలో వచ్చిన సమస్యల అర్జీల పరిష్కారానికి సంబంధించిన నివేదికను సంబంధిత అధికారులు తనకు అందించాలని ఆదేశించారు.

స్పందనలో వచ్చిన అర్జీలు 8

స్పందనలో మొత్తం 8 అర్జీలు వచ్చాయని మేయర్ భాగ్యలక్ష్మి తెలిపారు. పట్టణ ప్రణాళిక విభాగం - 4, రెవెన్యూ -2, ఇంజినీరింగ్, ప్రాజెక్ట్ ఆఫీసర్(యూసీడీ) విభాగాలకు చెందిన ఒక్కో అర్జీ వచ్చిందన్నారు. సమావేశంలో చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ రత్నావళి, సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, డెప్యూటీ కమిషనర్(రెవెన్యూ) డి.వెంకటలక్ష్మి, ప్రాజెక్ట్ ఆఫీసర్(యూసీడీ) శకుంతల, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ రవిచంద్, ఏడీహెచ్ శ్రీనివాసు, మేనేజర్ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ జానారెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): రహదారుల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని 30వ డివిజన్ కార్పొరేటర్ బీహెచ్ఎస్‌వీ జానారెడ్డి తెలిపారు. స్థానిక 30వ డివిజన్‌లో సోమవారం ఆయన నిర్మాణంలో ఉన్న రహదారులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో రోడ్డు పనులు పూర్తికాకపోవటంతో రాకపోకలకు ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. అలాగే యూజీడీ మ్యాన్‌హోల్స్ రోడ్డుకన్నా ఎత్తులో ఉండటంతో వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. దీంతో మ్యాన్‌హోల్స్‌తో సమానంగా రోడ్డు పనులు పూర్తిచేస్తామని చెప్పారు. మెయిన్ రోడ్డులో యూజీడీ వాటర్ వర్క్స్ పనులు జరుగుతున్న దృష్ట్యా ప్రత్యామ్నాయంగా రైల్వే ట్రాక్ పక్క నుంచి రహదారి ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

4న గిరి ప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): లోక కల్యాణార్థం, భక్త జన శ్రేయస్సును కాంక్షిస్తూ పౌర్ణమి గిరి ప్రదక్షిణను జూన్ 4వ తేదీన నిర్వహిస్తున్నట్లు దుర్గగుడి ఈవో భ్రమరాంబ పేర్కొన్నారు. 4వ తేదీ ఆదివారం తెల్లవారుజామున 5.55 గంటలకు దుర్గాఘాట్‌లోని కామధేను అమ్మవారి ఆలయం నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుందన్నారు. 7 కిలోమీటర్ల మేర సాగే ప్రదక్షిణలో అమ్మవారి భక్తులు, భవానీలు, సేవా బృంద సభ్యులు పాల్గొనాలని కోరారు.